ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 21 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలకు నిర్వహించిన రెండో విడుత శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. ఇదివరకు నిర్వహించిన ఎన్నికల విధులే కదా అని శిక్షణ తరగతులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని తెలుసుకోవాలని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే, శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ భిన్నంగా ఉంటుందని తెలిపారు. బ్యాలెట్ పద్ధతిన జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు ఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలు ఉన్నందున ఓపిక, సంయమనంతో వ్యవహరిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఈ 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని, గడువులోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూ లైన్‌లో ఉన్న వారికి వరుస క్రమంలో టోకెన్లు అందించి వారిచే ఓటింగ్ జరిపించాలని తెలిపారు. పోలింగ్‌కు ఒక రోజు ముందుగానే ఈ నెల 26న ఉదయం 8 గంటలకు ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూషన్ రోజు బ్యాలెట్ బాక్సులు తీసుకొని, పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత వాటిని నల్లగొండలోని రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని తెలిపారు. పోలింగ్ డే సందర్భంగా పీఓలు, ఏపీఓలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి మాస్టర్ ట్రైనర్లు నర్సిరెడ్డి, హరినాథ్ రెడ్డి, పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భువనగిరి ఆర్‌డీఓ కృష్ణారెడ్డి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఎలక్షన్ సిబ్బంది శ్రీకాంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలను గెలిపించాలి

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 21: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలను గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి పూల రవీందర్‌కు ఓటు వేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలు గెలిస్తే 2028లో బీసీ సీఎం అవడం ఖాయమని తెలిపారు. రాష్ట్రంలో కేవలం 5శాతం ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి అన్ని ఉపాధ్యాయ సంఘాలు రెడ్లకు బీఫామ్‌లు ఇచ్చాయని, బీసీలకు మాత్రం టికెట్లు నిరాకరించి బహుజనులను అవమానించాయని చెప్పారు. సమావేశంలో భువనగిరి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సాబన్‌కార్ వెంకటేశ్, ఆయా మండలాల అధ్యక్షులు అశోకచారి, సాయిని యాదగిరి, పేరపు రాములు, కంబాలపల్లి శ్రీరాములు, వట్టిపల్లి రాజు, రాజా పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం

స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి21 : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాందయాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు చిత్తరంజన్, శ్రీనివాస్, లలిత, సంతోష తదితరులు పాల్గొన్నారు.

వంగాల వాసికి డాక్టరేట్

పాల శ్రీనివాస్

గుండాల, ఫిబ్రవరి 21 : మండలంలోని వంగాల గ్రామానికి చెందిన పాల శ్రీనివాస్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ సి.మురళీకృష్ణ పర్యవేక్షణలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లిష్‌లో తృతీయ స్థాయిలో అభ్యాసకులకు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ నైపుణ్యాలను బలోపేతం చేయడానికి డిజిటల్ వనరులను ఉపయోగించడం అనే టాపిక్‌పై అధ్యయనం చేసి డాక్టరేట్ సాధించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను గ్రామస్తులు తదితరులు అభినందించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

స్టడీ మెటీరియల్ పంపిణీ

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 21 : పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు శుక్రవారం చంద్రన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్‌కు సంబంధించిన బిట్ బ్యాంకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యుడు హనుమంతు సాయిచందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను తమ ఫౌండేషన్ ప్రోత్సహిస్తుందన్నారు. పదో తరగతి విద్యార్థులు 10జీపీఏ సాధిస్తే ఫౌండేషన్ తరపున రూ.50వేల నగదు, గోల్డ్ మెడల్ అందించనున్నట్లు పేర్కొన్నారు. హెచ్ఎం నర్సింహా రెడ్డి, క్రాంతి, సత్యం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆరేండ్లుగా కృషి : టీఎస్‌యూటీఎఫ్

రామగిరి, ఫిబ్రవరి 21 : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారానికి గత ఆరేండ్లుగా అల్లుబెల్లి నర్సిరెడ్డి ఎంతో కృషి చేశారని, మరోసారి ఆయనను గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అన్నారు. నల్లగొండలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ విద్యా, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు. నర్సిరెడ్డి చొరవతోనే టెట్ వివాదం పరిష్కారమైందని, వేలాది మంది ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వచ్చాయని స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, మాజీ రాష్ట్ర కార్యదర్శి నర్రా సరళ, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, జిల్లా కార్యదర్శి నలపరాజు వెంకన్న పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా నరేశ్

నరేశ్, శంకర్

రామగిరి, ఫిబ్రవరి 21 : ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా ఆకారపు నరేశ్, కార్యదర్శిగా ఖమ్మంపాటి శంకర్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. నల్లగొండలో జరిగిన ఆ సంఘం జిల్లా మహాసభల్లో నూతన అధ్యక్ష, కార్యదర్శులుతో పాటు 28 మంది కార్యవర్గాన్ని నియమించినట్లు సంఘం నాయకులు తెలిపారు.

సీపీఎస్ రద్దుకు కృషి : గాల్‌రెడ్డి

రామగిరి, ఫిబ్రవరి 21 : సీపీఎస్ రద్దుతోపాటు 317 పరిష్కారం, సర్వీసు రూల్స్ సాధనే లక్ష్యంగా కృషి చేస్తానని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని లయన్స్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘాల నాయకులున్నారు.

కల్తీ ఆహారాన్ని నియంత్రించాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, ఫిబ్రవరి 21 : హోటళ్లు, రెస్టారెంట్లు, మాల్స్, బడ్డీ కొట్లలో కల్తీ ఆహారం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, నియంత్రించే దిశగా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన ఆహార భద్రతా సమావేశంలో ఆమె హాజరై మాట్లాడారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, పశు సంవర్ధక శాఖ అధికారులతో కలిసి తనిఖీలు చేస్తూ వాడిన నూనెలను తిరిగి వాడటం, కాలపరిమితి పూర్తయిన ఆహార పదార్థాలను వినియోగించటం వంటివి పరిశీలించి సీజ్ చేయాలన్నారు. జిల్లాలోని కేజీబీవీలు, అంగన్‌వాడీలు, జీజీహెచ్ తదితర సంస్థల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు, రోగులకు భోజనం సరఫరా చేస్తున్నారని అక్కడ కూడా తనిఖీలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఫుడ్ సేఫ్టీ జోనల్ అధికారి జ్యోతిర్మయి, జిల్లా అధికారి స్వాతి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్, ఇండస్ట్రీయల్ జీఎం కోటేశ్వర్‌రావు, డీఏఓ శ్రవణ్ కుమార్, డీఈఓ భిక్షపతి, ఎస్పీ డీఎస్పీ రమేశ్, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే గుర్తింపు: కలెక్టర్

మునుగోడు : చదువుతోనే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ త్రిపాఠి అన్నారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం, కేజీబీవీ, పీహెచ్‌సీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తాసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీసీ హాస్టల్ వార్డెన్, కేజీబీవీ ఎస్ఓ అందుబాటులో లేకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె వెంట చండూరు ఆర్డీఓ శ్రీదేవి, ఎంపీడీఓ శాంతకుమారి, తాసీల్దార్ నరేందర్, ఆర్ఐ నాగరాజు, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

చిట్యాల : చిన్నకాపర్తి జడ్పీహెచ్ఎస్‌లో వివిధ వేషధారణలో విద్యార్థులు

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

చిట్యాల, ఫిబ్రవరి 21 : అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని మండలంలోని చిన్నకాపర్తి జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పుస్తకాల ప్రదర్శన, పొడుపు కథలు, సామెతలు, ఆటలు ఆడి ఆలరించారు. అలాగే తెలంగాణ అక్క, పోతురాజు, పిట్టల దొర వంటి వేషధారణలో అలరించారు. నాటికలు, నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం గీత, ఉపాధ్యాయులు బాలయ్య, నయీముద్దీన్, సాయిబాబా, మాధవి, నవ్య, సుశ్విత, శ్రీలత, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మిర్యాలగూడటౌన్ : పట్టణంలోని కాకతీయ హైస్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరక్టర్ చీదెళ్ల, వెంకట్, ప్రిన్సిపాల్ సతీశ్ హాజరయ్యారు.

నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని నిరసన

మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 21 : బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ బ్యాంకు పని దినాలను ఐదు రోజులకు కుదించాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో మిర్యాలగూడ ఎస్‌బీఐ, అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాలకు కుర్చీల అందజేత

శాలిగౌరారం, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో 2003-04 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థి వసుకుల శ్రవణ్ రూ.10వేల విలువైన 4 కుర్చీలను పాఠశాల హెచ్ఎం కోట మల్లయ్యకు శుక్రవారం అందించారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు తాటిపాముల శంకర్, రాజు, జయరాజు, గిరిగంటి శంకర్, కర్నాటి గిరి, వాడపల్లి మల్లేశ్, రవి ఉన్నారు.

23న సైన్స్ టాలెంట్ టెస్ట్

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 21: నేషనల్ సైన్స్ డే సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 23న నిర్వహించనున్న సైన్స్ టాలెంట్ టెస్ట్ గోడ పత్రికను శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గొళ్లమూడి రమేశ్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని శాస్త్రీయ ఆలోచనలను వెలికితీసేందుకు జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 99124 05371 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దయానంద్, నారాయణరెడ్డి, నాగరాజు, సురేశ్‌కుమార్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరో నెలలోనే డెలివరీ

● 850 గ్రాముల బరువుతో పుట్టిన బిడ్డ

మిర్యాలగూడ, ఫిబ్రవరి 21: పట్టణంలోని జ్యోతి ఆసుపత్రి వైద్యులు ఆరు నెలల గర్భిణికి డెలివరీ చేశారు. వైద్యులు జీవనజ్యోతి, అమూల్య, రమేశ్, వేణుగోపాల్‌రావు శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. నల్లగొండ మండలంలోని చిన్నసూరారం గ్రామానికి చెందిన ఏర్ల అశోక్, రమ్య దంపతులకు రెండో కాన్పులో 6 నెలల గర్భంలోనే పురిటి నొప్పులు రావడంతో దవాఖానకు రాగా 14డిసెంబర్ 2024న నార్మల్ డెలివరీ చేశారు. ఆడపిల్ల జన్మించగా అన్ని అవయవాలు ఉన్నప్పటికీ స్పందన లేకపోవడంతో 69 రోజుల పాటు దవాఖానలోనే ఉంచి వైద్యం చేశారు. బేబీ 850 గ్రాములు పుట్టిందని, 69 రోజుల వైద్యం తరువాత 1.40 కేజీలకు చేరిందని తెలిపారు. వైద్యానికి చిన్నారి సహకరించిందని, ఇప్పుడు అన్ని అవయవాలు బాగా పనిచేస్తున్నాయన్నారు. పాప ఆరోగ్యం నిలకడగా ఉండడంతో శుక్రవారం డిశ్చార్జి చేసినట్లు పేర్కొన్నారు.

చిట్యాల వాసికి డాక్టరేట్

అవార్డు అందుకుంటున్న బాబురావు

చిట్యాల, ఫిబ్రవరి 23 : చిట్యాల మండల కేంద్ర వాసి బొడ్డు బాబురావుకు హైదరాబాద్‌కు చెందిన మనం ఫౌండేషన్ డాక్టరేట్ అవార్డును అందించారు. గురువారం రాత్రి హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఓకులాభరణం కృష్ణమోహన్, డాక్టర్ ఆదినారాయణ, నేరెళ్ల మాల్యాద్రి చేతులమీదుగా బాబురావు ఈ అవార్డును అందుకున్నారు.

వెటర్నరీ జేడీగా రమేశ్

రమేశ్‌కు అభ్యోనం పలుకుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, ఫిబ్రవరి 21 : జిల్లా పశుసంర్ధక శాఖ అధికారిగా జీవీ రమేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నాగర్‌కర్నూల్ డీడీగా పనిచేస్తున్న రమేశ్‌కు ప్రభుత్వం జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించగా శుక్రవారం నల్లగొండ కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం నల్లగొండ డివిజన్ ఏడీగా పనిచేస్తున్న ఖాద్రి ఇన్‌చార్జి జేడీగా విధులు నిర్వహిస్తుండగా రమేశ్ రాకతో ఆయన తిరిగి ఏడీగానే కొనసాగనున్నారు.

ఈనెల 28న జాతీయ సైన్స్ దినోత్సవ పోటీలు : డీఈఓ

రామగిరి, ఫిబ్రవరి 21 : విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేలా ఈనెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి భవన్ సికింద్రాబాద్(హైదరాబాద్)లో పోస్టర్‌మేకింగ్, క్విజ్, సైంటిఫిక్ మోడల్స్‌పై పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ భిక్షపతి శుక్రవారం ఒక ప్రటకనలో తెలిపారు. ఈ నెల 23లోగా https://rb.nic.in/Rbnila/am లింక్ ద్వారా అర్హులు, ఆసక్తి గల విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 27న రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే పోటీల్లో ప్రత్యేక్షంగా పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. విజేతలకు ఈనెల 28న జరిగే వేడుకల్లో బహుమతులు అందిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి 9848578845 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కుమార్తెపై లైంగికదాడి కేసులో తండ్రికి 20 ఏండ్ల జైలు

నీలగిరి, ఫిబ్రవరి 21 : కన్న కూతురిపై లైంగిక దాడికి తండ్రికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కట్టంగూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి 2023 డిసెంబర్ 14న ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి కూతురిపై లైంగిక దాడికి పాల్పడి ఎవరికీ చెప్పొద్దని బెదిరించినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న తల్లి కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేసి సరైన ఆధారాలు కోర్టుకు సమర్పించడంతో లైంగిక దాడి, పోక్సో కేసులు నమోదు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా ప్రత్యేక న్యాయమూర్తి కలకుర్తి విశ్వనాథ్ దిలీప్‌రావు తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. కోర్టుకు సరైన ఆధారాలు సమర్పించిన అప్పటి విచారణాధికారి ఎస్.రాఘవరావు, శ్రీనివాస్‌రెడ్డి, డి,రాజు, ప్రస్తుత సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ రవీందర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్, సీడీఓ రువ్వ నాగరాజు, ఎం. కల్పన, కోర్టు కానిస్టేబుళ్లు నరేందర్, ఎన్.మల్లికార్జున్‌ను అభినందిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్ల కాపరి మృతి

తిప్పర్తి, ఫిబ్రవరి 21 : మండలంలో శుక్రవారం విద్యుదాఘాతంతో గొర్ల కాపరి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన సింగం భాస్కర్(50) శుక్రవారం ఉదయం గొర్లను మేపడం కోసం గ్రామ శివారులోని సోమరాజు చెరువు దగ్గరకి వెళ్లాడు. తుమ్మ చెట్టు ఎక్కి గొర్లకు తుమ్మ మండలను కొడుతుండగా కొమ్మలకు కరెంటు వైర్లు తగులడంతో భాస్కర్‌కు కూడా షాక్ తగిలి చెట్టుపైనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి చిన్న కుమారుడు సింగం భరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం : ఎస్ఎఫ్ఐ

హాలియా, ఫిబ్రవరి 21 : విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేశ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా దాని గురించే మాట్లాడక పోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో రూ.8,350 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందని, పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎలా చదువుకోవాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తనను మూడోసారి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవం చేసిన వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

గుండాల ధరణి ఆపరేటర్ విధుల నుంచి తొలగింపు

గుండాల, ఫిబ్రవరి 21 : మండలంలోని ధరణి ఆపరేటర్‌ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల గుండాల మండల కేంద్రంలోని సర్వే నంబర్ 177లో యూసుఫొద్దీన్ పేరున ఉన్న 9 ఎకరాల 17 గుంటల భూమిని సయ్యద్ ఇబ్రహీం అనే వ్యక్తి ఆధార్ కార్డు మీద పేరు, తండ్రి పేరు మార్పిడి చేసి అక్రమంగా పట్టా చేసుకున్న విషయం తెలిసిందే. సయ్యద్ ఇబ్రహీంతో పాటు మండల కేంద్రానికి చెందిన మాదరబోయిన నర్సింహులు, మంద మహేశ్వరిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. తాసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న ధరణి ఆపరేటర్ కర్రె రాజును విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సదరు భూమిని యధావిధిగా మరణించిన వ్యక్తి యూసుఫొద్దీన్ పేరు మీదకు బదిలీ చేసి ఆన్‌సైన్‌లో ఉంచినట్లు, ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ కృష్ణారెడ్డిని ఆదేశించారు.

విద్యార్థుల విద్యావికాసం మాతృ భాషతోనే సాధ్యం

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు కవుల చిత్రపటాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ సుంకోజు భాస్కర్, విద్యార్థులు

● ఎంఈఓ సుంకోజు భాస్కర్

వలిగొండ, ఫిబ్రవరి21: విద్యార్థుల విద్యావికాసంతోపాటు వ్యక్తిత్వ వికాసం మాతృ భాషతోనే సాధ్యమవుతుందని మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని లోతుకుంట ఆదర్శ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. భావ వ్యక్తీకరణ మాతృ భాషతో ప్రారంభమై తోటి వారితో ఆలోచనలు పంచుకోవడం మొదలవుతుందని, మాతృ భాషపై పట్టున్న విద్యార్థులు మిగతా భాషలను సులభంగా అవగాహన చేసుకొని ప్రావీణ్యం పొందుతారని తెలిపారు. ఈ సందర్భంగా 116 మంది తెలుగు కవుల చిత్రపటాలను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రయీసున్నీసా బేగం, ఉపాధ్యాయులు శేఖర్, బి. కృష్ణ, ఎండీ గౌస్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

నందిని

చౌటుప్పల్, ఫిబ్రవరి 21 : రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందిన సంఘటన చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది.. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కొయ్యడ నందిని(40) హైదరాబాద్‌లోని నాగోల్ ఆనంద్ నగర్‌లో కొంతకాలంగా నివాసముంటూ బ్యూటీపార్లర్ నడుపుతున్నారు. తన భర్త సత్యనారాయణతో కలిసి బైక్‌పై వలిగొండ మండలం గొల్లెపల్లి గ్రామంలోని తన అడబిడ్డ ఇంటికి శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డు క్రాస్ చేస్తుండగా విజయవాడ వైపు నుంచి వస్తున్న కంటైనర్ లారీ వెనుక నుంచి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నందిని అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. సీఐ మన్మథకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం వద్ద భర్త సత్యనారాయణ రోదన పలువురిని కంటతడి పెట్టించింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృ